క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఏలూరు టౌన్: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు సత్రంపాడులోని చైతన్య గోదావరి గ్రామీణ రీజనల్ బ్యాంక్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన శిబిరంలో 25 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారని రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు రీజనల్ మేనేజర్ యు.శ్రీదేవి మాట్లాడుతూ భారతదేశం అవినీతిరహిత దేశంగా ఏర్పడాలనే ఉద్దేశంతో, ఉద్యోగుల పనితీరును ప్రోత్సహించే విధంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు హెచ్‌వోడీ బి.కిషన్, రెడ్ క్రాస్ వైద్యులు ఆర్ఎస్ఆర్‌కే వర ప్రసాదరావు, పీఆర్‌ఓ కేపీ రమణ తదితరులు ఉన్నారు.

ఓట్ల నమోదులో నిబంధనలు పాటించాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కలెక్టర్‌ను కోరుతూ డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లచేర్పింపు సందర్భంగా జిల్లాలోని కొందరు అధికారులు అధికార పార్టీలతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఆయుర్వేద శిబిరంలో ఉచిత పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు నగేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధన్వంతరి వైద్య భగవాన్ జయంతి పర్వదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం స్థానిక గీతా భవనంలో మంగళవారం ఉదయం నిర్వహించారు. ఆయుర్వేద వైద్య నిపుణుడు బీవీఎం నగేష్ బృందం 54 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నా వెంకట రామయ్య, పిల్లి పండరీనాథ్, వనిమిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు పెంచాలని రైతుల ఆందోళన

ఉంగుటూరు: ధాన్యానికి మద్దతు పెంచాలని కైకరంలో అన్నదాతలు ఆందోళన చేపట్టారు. అన్నదాతలను ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోందని, 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసి, కేవలం 3.40 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడం రైతులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. రైతు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపయోగంగా చెత్త శుద్ధి కేంద్రాలు

- గ్రామాల్లో పట్టించుకోని పాలకులు
- కొరవడిన పర్యవేక్షణ



గుడివాకలంకలో అలంకార ప్రాయంగా మారిన షెడ్డు

ఏలూరు రూరల్ : గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త శుద్ధి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు అవాస కేంద్రాలుగా మారాయి. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు, మండలాధికారుల పర్యవేక్షణ కరువైంది. ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 13 శాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.

అలంకారప్రాయం

చాటపర్రు శ్మశాన వాటిక పరిసరాల్లో నిర్మించిన శుద్ధి కేంద్రం షెడ్డు నిరుపయోగంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను స్థానిక సబ్ స్టేషన్ వద్ద పారబోస్తున్నారు. జాలిపూడి శివారు నిర్మించిన షెడ్డు అసాంఘిక శక్తులకు ఆవాస కేంద్రంగా, పరిసరాలు బహిర్భూమిగా మారాయి. ఈ కేంద్రం చుట్టూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మొండికోడులో అంగన్‌వాడీ సెంటర్ పక్కన నిర్మించిన కేంద్రాన్ని ఉపయోగించడం లేదు. కోమటిలంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు, గుడివాకలంక, పెదయాగనమిల్లి, కలక్రుర్రు తదితర కొల్లేరు గ్రామాల శివారున నిర్మించిన కేంద్రాలు అలంకార ప్రాయంగా మిగిలాయి.

అధికారులకు మాత్రమే రోల్‌మోడల్

మల్కాపురంలో నిర్మించిన శుద్ధి కేంద్రం అధికారులకు రోల్ మోడల్‌గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ



మొండికోడులో పశువుల కొట్టంలా మారిన షెడ్డు



కొక్కిరాయిలంకలో ఖాళీగా ఉన్న షెడ్డు

ఆదేశాల మేరకు రాష్ట్ర లేదా జిల్లా అధికారులు శుద్ధి కేంద్రాల సందర్శనకు వచ్చినప్పుడు, మండలాధికారులు ఈ కేంద్రాన్ని ముస్తాబు చేసి చూపిస్తున్నారు. ఇందుకు ఇక్కడ ఉత్సాహం గల కొందరు రైతులు, ఔత్సాహికులు చెత్తను కంపోస్టుగా మార్చేందుకు ప్రయత్నించడమే కారణం.

నీరు గారుతున్న ఆశయం

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెత్త శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామ జనాభా ప్రాతిపదిక ఆధారంగా ప్రతి గ్రామానికి ఒక కేంద్రం నిర్మించారు. ఇందుకోసం రూ.2 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించారు. పల్లెల్లో ప్రజల నుంచి చెత్త సేకరించి ఈ కేంద్రాలకు తరలించాలి. ఇక్కడ ప్లాస్టిక్, కాగితం తదితర వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేయాలి. భూమిలో కలిసిపోగల చెత్తను కంపోస్టుగా తయారు చేయాలి. ఈ కంపోస్టు స్థానిక రైతులు లేదా వ్యాపారులు అమ్మడం ద్వారా సంపద సృష్టించాలి. కాని నేడు శాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు మురుగు, దుర్గంధం వెదజల్లే యార్డులుగా మారిపోయాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **పంచాయతీలు నిర్వహించాలి**
>
> 
>
> నేను రెండు రోజుల క్రితమే ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టాను. గ్రామల్లో శాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేపడతాం. వీటిని పంచాయతీ పాలకవర్గాలు నిర్వహించాలి. గ్రామాల్లో సేకరించిన చెత్త కంపోస్టుగా మార్చి విక్రయించాలి. ఈ అమ్మకాల ద్వారా పంచాయతీలకు అధనంగా ఆదాయం సమకూరుతుంది.
>
> – షరీఫ్, ఈఓపీఆర్డీ

డీఆర్‌ఓ పుష్పమణికి ఆత్మీయ వీడ్కోలు



పుష్పమణిని సత్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్పష్టమైన ఆలోచన, విషయం పట్ల అవగాహనతో సహ ఉద్యోగులతో సమర్థవంతంగా డీఆర్‌ఓ డి.పుష్పమణి విధులు నిర్వహించినట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లుతున్న డి.పుష్పమణికి వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఆత్మీయ విడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని మాట్లాడారు. పుష్పమణి ఎన్నికల నిర్వహణలో నిబద్ధత, జవాబుదారితనంతో పనిచేశారని గుర్తుచేశారు. డీఆర్‌ఓ పుష్పమణి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనకు ప్రోత్సాహం అందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి పుష్పమణికి పుష్పగుచ్ఛాలు, శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. సభలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డిప్యూటీ కలెక్టర్లు, ముక్కంటి, దేవకిదేవి, ఎస్‌డీసీ కె.భాస్కర్, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌కు 125 బెడ్స్ అందజేత



జీజీహెచ్‌లో బెడ్స్‌ను వైద్యాధికారులకు అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: కేబుల్, ఇంటర్‌నెట్ రంగాల్లో విశేష గుర్తింపు పొందిన యాక్ట్ సంస్థ సమాజ సేవల్లోనూ ముందుండడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు సర్వజనాసుపత్రికి రోగుల సౌకర్యార్థం యాక్ట్ డిజిటల్ హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.15 లక్షలు విలువైన ఎమర్జెన్సీ పడకలు 25, సాధారణ పడకలు 100 ఏర్పాటు చేసింది. వీటిని ఏలూరు సర్వజనాసుపత్రిలో మంగళవారం ఎమ్మెల్యే మేయర్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించి ఆస్పత్రి అధికారులకు అందజేశారు. రోగుల బంధువులకు ఉపయుక్తంగా ఉండేలా వెయిటింగ్ రూమ్‌ను నిర్మించేందుకు ఆలోచన చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. యాక్ట్ ఆపరేషన్ హెడ్ బీవీ సుబ్బారావు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ సీహెచ్ దుర్గాకుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, యాక్ట్ సంస్థ జనరల్ మేనేజర్ టి. సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

జాలిపూడిలో 'చెత్త' రాజకీయం



జాలిపూడి సచివాలయం ముందు చెత్త పోసిన దృశ్యం

ఏలూరు రూరల్ : మంగళవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామ సచివాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికురాలు గోగులమూడి ప్రశాంతి చెత్త పోసింది. జీతం బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ చర్యకు పాల్పడ్డానని చెప్పింది. ఇదిలా ఉండగా విధులు సరిగ్గా నిర్వహించకపోవడం వల్ల ప్రశాంతిని కొద్ది నెలల క్రితమే తొలిగించామని గ్రామ సర్పంచ్ వీధి నవ్య చెప్పారు. గ్రామ ఉపసర్పంచ్ దాసరి నరసింహారావు, టీడీపీ నాయకులు చుక్క వెంకటేశ్వరరావు, ఆత్రగడ్డ శ్రీను, నందిగాం రమేష్‌తో పాటు ఆరమండ సురేష్ తదితరులు పారిశుద్ధ్య కార్మికురాలు ప్రశాంతిని అడ్డం పెట్టుకుని సర్పంచ్ విధులకు ఆటంకం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ కార్యాలయంలో విలువైన సామగ్రి పక్కదారి పట్టించారని, ఇదేమని ప్రశ్నించినందునే అసత్యాలతో అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిజ్జువరపు రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ నియామకాన్ని తక్షణం చేపట్టాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘం కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన దళిత సేన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ నియమకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని, దళితులపై జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో అరికట్టాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టముగా అమలు చేయాలని, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏలూరు జిల్లా దళిత సేన మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, కార్యదర్శి పింగుల ఇధియ, తాత్కాలిక ఉద్యోగుల అధ్యక్షుడు శ్రీకాకొల్లు స్టాలిన్, సలహాదారులు ముప్పిడి సుబ్బారావు, లింగపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షుడు కొప్పుల నాగేందరరావు, చింతలపూడి మండల మహిళా అధ్యక్షురాలు మోనూరి దేవ మాత, పెదవేగి మండల మహిళా అధ్యక్షురాలు రేమల్లే స్వర్ణకమల, చింతలపూడి పట్టణ అధ్యక్షుడు మోనూరి కార్తీక్, కైకలూరు మండల అధ్యక్షులు అజయ్ పాల్గొన్నారు.

హైందవ సంస్కృతిపై దాడులు సహించం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందూ మతంపై, హైందవ సంస్కృతి, సంప్రదాయాలు, నమ్మకాలపై హిందూయేతర సంఘాలు చేస్తోన్న దాడులను సహించేది లేదని హిందూ ధర్మరక్షా సమితి ప్రతినిధులు హెచ్చరించారు. హిందూధర్మ రక్షా సమితి రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. హిందూ ఆలయాల్లో ఇటీవల జరుగుతున్న అనేక చోరీలు, ధూప దీప నైవేద్యాల సమస్యలు, ఆలయ భూముల ఆక్రమణలు, ఆలయాల భద్రత అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. హిందూ ఆలయాలకు రక్షణ కల్పించాలని, భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలయాల్లో చోరీలు జరక్కుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోకా శ్రీనివాసరావు ఏలూరు జిల్లా నూతన కమిటీలను నియమించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఉభయ తెలుగు రాష్ట్రాల హిందూ ధర్మ రక్షా సమితి లీగల్ అడ్వైజర్ చేదులూరి కేశవ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఏగిరెడ్డి శ్రీనివాసరావు, కొల్లూరి చంద్రమౌళి, మోర్ల రంగబాబు, కురెళ్ల సుధాకర్ కృష్ణ, వివేకానంద సమితి నిర్వాహకులు సదాశివ, ఏలూరు జిల్లా అధ్యక్షులు పరసా వీర్రాజు, కార్యదర్శి అడబాల నరసింహారావు, పలువురు జిల్లా కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురి అరెస్టు

ఉంగుటూరు: బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరపరుస్తున్నట్టు ఎస్సై సూర్యభగవాన్ మంగళవారం తెలిపారు. వెల్లమిల్లిలో కంబంపాటి రమేష్ వద్ద నుంచి బీరు సీసాలు 3, క్వార్టర్ బాటిళ్లు, రూ.1,350 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. చిన్న వెల్లమిల్లికి చెందిన జుత్తిక నాగేశ్వరరావు వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లు, రూ.1,350 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎ.గోకవరంలో మిరియాల మంగరాజు వద్ద నుంచి 18 మద్య బాటిళ్లు, రూ.6,630 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని వివరించారు.

నాయీబ్రాహ్మణులను గుర్తించిన జగన్



జయప్రకాష్‌ను కలిసిన కింజంగి రాజు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులకు గుర్తింపు నిచ్చింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఏలూరు నగర కార్యదర్శి, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కింజంగి రాజు అన్నారు. స్థానిక గన్‌బజార్ సెంటర్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌ను కింజంగి రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు నగరంలో పార్టీ బీసీ సెల్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. గతంలో నాయీబ్రాహ్మణులను అవహేళనగా మాట్లాడిన సీఎంలను చూశామని, ఆ తర్వాత అధికారం చేపట్టిన జగన్ నాయీ బ్రాహ్మణులను అక్కున చేర్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆలయాల ట్రస్ట్ బోర్డు కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీల పక్షపాతిగా పేరుగాంచిన జగన్ వెంటే అధిక సంఖ్యలో బీసీలు ఉన్నారని చెప్పారు.

జీవనశైలిలో మార్పులతో స్ట్రోక్స్ నివారణ



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మరణాలకు స్ట్రోక్స్ ప్రధాన కారణమని, దాదాపు 80 శాతం స్ట్రోక్‌లు జీవనశైలి మార్పులు, అవగాహన ద్వారా నివారించవచ్చని నగరంలోని అశోకవర్ధన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ పార్వతి అన్నారు. స్థానిక దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్ – టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక వర్ధన భవిత కేంద్రంలో వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్వతి మాట్లాడుతూ స్ట్రోక్‌లు, వాటి కారణాలు, నివారణ, చికిత్స పునరావాసం ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్ డేని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 25 ఏళ్లు పైబడిన నలుగురిలో ఒకరు తమ జీవితకాలంలో స్ట్రోక్‌ను ఎదుర్కొంటారని, దీనికి నివారణ, చికిత్సా ఎంపికలకు సంబంధించి ప్రజలు జ్ఞానం పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, కృత్రిమ అవయవాలు, యూడీఐడీ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. దివ్యాంగులు ఈ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, భవిత కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కెనరా బ్యాంక్ శాఖ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడులో కెనరా బ్యాంక్ నూతన శాఖను ప్రాంభించనున్నట్టు ఆ బ్యాంక్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న శ్రీ ఆరోగ్య ఫార్మసీ పై ఏర్పాటు చేసిన నూతన శాఖను బుధవారం ఉదయం 10.30 గంటలకు తమ బ్యాంక్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి సీజే ప్రాంభిస్తారని వివరించారు.

చక్కని ప్రణాళికతో విద్యనభ్యసించాలి

భీమడోలు: భీమడోలు వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో చదువుకున్న పేద విద్యార్థులకు రూ.15వేల పరీక్ష ఫీజును ఓ మహిళ మంగళవారం చెల్లించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పూళ్ల గ్రామానికి చెందిన విద్యావంతురాలు వర్థినీడి వెంకటవినుత కళాశాలలోని 15 మంది పేద విద్యార్థులు పరీక్ష ఫీజు నిమిత్తం ఒకొక్కరికీ వెయ్యి రూపాలయ చొప్పున ప్రిన్సిపల్ మాధవికి అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు చక్కని ప్రణాళికతో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె విద్యార్థులను కోరారు. వెంకటవినుతను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

ఏలూరులో దివాళితో మైభారత్



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ నిబంధనలు పరిశీలిస్తున్న విద్యార్థులు

ఏలూరు రూరల్ : దివాళితో మైభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెహ్రూ యువ కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ మల్లికార్జున్ పరివేక్షణలో సెయింట్ ఆన్స్, సీఆర్ఆర్ ఉమెన్స్ కళాశాల విద్యార్థులు రోగులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. రోగులకు సహాయ, సహకారం అందించడంతో పాటు రోగులు ఉపయోగించే పరికరాల పనితీరుపై అవగాహన పెంచుకున్నారు. ఎన్‌వైకే వాలంటీర్లతో పాటు పలువురు విద్యార్థులు ఫైర్‌స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములయ్యారు. సీఐ లక్ష్మణరావు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్ల కలిగే ప్రమాదాలను విద్యార్థులకు వివరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌భేగం కార్యక్రమాలను ప్రారంభించి, విద్యార్థులను అభినందించారు కార్యక్రమాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్‌వైకె అధికారి దూలం కిషోర్ పరివేక్షించారు.